క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మిలిట్రీ–2 ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు సన్‌సిటీ, పిఅండ్‌టి కాలనీ, ఏ,బీ,సీ,డీ బ్లాక్స్, స్పెషల్ బ్లాక్స్, మాపెల్‌టౌన్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, హైదర్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్‌లో...

గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు కోత విధిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ గ్రామంలో ఈదమ్మ తల్లి, వీరభద్ర స్వామి, భద్రకాళీ, నాగదేవతల దేవాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హామీలు అమలయ్యే వరకు పోరాటం



గృహ నిర్బంధంలో తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీజేపీ తరఫున ఆందోళన కొనసాగిస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సాధన కోసం రాష్ట్ర బీజేపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలో చేపట్టిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమానికి తరలివెళుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో తమను అడ్డుకోలేరన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సీక్రెట్ ఆఫ్ కర్మ ఫిలాసఫీ' అనే అంశంపై సివిల్ ఇంజనీర్, సీనియర్ రాజయోగి బి.కె. సూరజ్‌సింగ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

హెచ్‌సీయూలో 21న జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగుశాఖ, మానవీయ శాస్త్రాల విభాగం, గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ జాతీయస్థాయి సదస్సును ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామని తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, ఆచార్యులు కొవ్వలి గోపాలకృష్ణ, పమ్మి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు జీవితం, రచనలపై సదస్సును నిర్వహిస్తారు.


డివైడర్‌ను ఢీ కొని ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

మణికొండ: ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఆటో డివైడర్‌ను ఢీ కొని బోల్తా పడటంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక పీఎస్ సమీపంలో ఇటీవల ప్రారంభించిన టోల్ గేట్ వద్ద కొత్తగా డివైడర్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో డివైడర్ సరిగా కనిపించకపోవటంతో అప్పా సర్కిల్ నుంచి నార్సింగి వైపు వస్తున్న ఆటో శుక్రవారం రాత్రి దానిని వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోల ప్రయాణిస్తున్న వ్యక్తితో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉందని నార్సింగి పోలీసులు పేర్కొన్నారు.



జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- రూ. 4 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అయన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం నుంచి ఎక్సైజ్ అకాడమీ వరకు బీటీ రోడ్డు పనులకు, ఎక్సైజ్ అకాడమీ నుంచి రాక్ చర్చి వరకు , రాక్ చర్చి నుంచి కిస్మత్‌పూర్ స్కూల్ వరకు రూ.4 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అందుకు ప్రతి కాలనీ, బస్తీల్లో పర్యటించి నేరుగా సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలత సురేష్‌గౌడ్, తలారీ చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, భూపాల్‌గౌడ్, అస్లాంబిన్, కోఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, నాగరాజు, రజాక్, డిఈ యాదయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు



దోభీఘాట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

కులవృత్తులకు చేయూత

శంషాబాద్: రాష్ట్రంలో కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు వారికి ఆర్థికంగా ప్రభుత్వం అండగా ఉంటోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఆరోవార్డులో శుక్రవారం స్థానిక కౌన్సిలర్ వై. కుమార్‌తో కలిసి రూ. 2 కోట్ల నిధులతో మోడ్రన్ దోభీఘాట్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమ కోసం పాటుపడుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు దోభీఘాట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రూ. 79 లక్షలతో పలు పార్కులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్.గణేష్‌గుప్తా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రజక సంఘం అభినందనలు..

ఎన్నో ఏళ్లుగా రజక సంఘం చేసిన వినతులపై స్పందించిన ప్రభుత్వం ఆధునిక(మోడ్రన్) దోభీఘాట్ నిర్మాణ పనులు ప్రారంభించడం అభినందనీయమని రజక సంఘం నాయకులు మెట్టు అశోక్, రాపోలు రాజు, మల్కాజగిరి రాజు, మెట్టు రమేష్, తీగల రమేష్, మెట్టు శ్రీనివాస్, మల్కాజగిరిరాజశేఖర్, నాగేశ్వర్, నర్సింగ్‌రావు, కృష్ణ, నర్సింహా, యాదయ్య, అంజనేయులు, వెంకటేష్, నాగరాజు అన్నారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఆదివాసీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కృషి



ఎంపీ రంజిత్‌రెడ్డితో చర్చిస్తున్న మిద్దెల సురేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్: అన్ని వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లో ఆదివాసీ సంక్షేమ సంఘం భవనాన్ని నిర్మించాలని ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. అత్తాపూర్‌లో ఆదివాసీ సంక్షేమ సంఘం భవన నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళతానన్నారు. త్వరలోనే భవన నిర్మాణానికి చర్యలు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో మిద్దెల సురేష్‌రెడ్డి, పి.ఎం.రెడ్డి, శంకర్, రవి తదితరులు ఉన్నారు.

హల్దీరామ్ స్టోర్ ప్రారంభం



అత్తాపూర్‌లో హల్దీరామ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న హల్దీరామ్ మార్కెటింగ్ హెడ్(రిటైల్) శుభమ్ శుక్లా

అత్తాపూర్: భారతీయ రెస్టారెంట్స్, స్వీట్స్ అవుట్‌లెట్ హల్దీరామ్ స్టోర్‌ను శుక్రవారం అత్తాపూర్‌లో హల్దీరామ్ మార్కెటింగ్ హెడ్(రిటైల్) శుభమ్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తాపూర్‌లోని పిల్లర్ నెంబర్ 181 సమీపంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో భారతీయ వంటకాల రుచులను అందిస్తామన్నారు. ది రాజ్ కచోరీ, చోలే భాతురే, పానీపూరి, పావ్‌బాజీ, పాలక్ పట్టా చాట్, చోలే కుల్చా, శాండ్‌విచ్ తదితర వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వంటకాలను స్విగ్గీ, జోమాటో ద్వారా మీ ఇంటి వద్దకే డెలివరీ చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. హల్దీరామ్‌కు మైలురాయిగా నిలిచిన ఈ కొత్త స్టోర్‌ను అత్తాపూర్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌లో 96 మంది సీటింగ్ కెపాసిటిని కలిగి ఉందన్నారు. హల్దీరామ్ డైరెక్టర్ నీరజ్ అగర్వాల్ మాట్లాడుతూ బెంగుళూరు తదితర నగరాలకు తమ సంస్థ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, స్వామిగౌడ్

బండ్లగూడ: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ఇంటి వద్ద సర్దార్ శుక్రవారం సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కత్తి పట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే, రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, మాజీ ఎంపీపీ, అర్జున్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'మా కుమార్తె చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోండి'



మాట్లాడుతున్న రాంరెడ్డి

పంజగుట్ట: గర్భవతిగా ఉన్న తన కుమార్తె మృతికి కారణమైన ఆమె అత్తింటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ కుటుంబం డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మృతురాలి తండ్రి రాంరెడ్డి, తల్లి సారమ్మ, సోదరుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ... తమ కుమార్తె ఆర్తీరెడ్డి ఎంకాం పూర్తి చేసి యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగం చేసేదన్నారు. 2020 మార్చిలో అత్తాపూర్ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంతోష్‌రెడ్డితో పెళ్లి చేశామన్నారు. వివాహ సమయంలో 40 తులాల బంగారం, నగదు, ఇతర సామగ్రి ఇచ్చినట్లు తెలిపారు. అయితే పెళ్లయిన కొద్ది రోజులనుంచే కుమార్తెకు వేధింపులు ప్రారంభయ్యాయన్నారు. ఉద్యోగం మాన్పించడమేగాక, అదనపు కట్నం తీసుకురావాలని నిత్యం వేధించేవారన్నారు. మొదట కూతురు పుట్టిందని చూసేందుకు కూడా రాలేదన్నారు. పెద్దల సమక్షంలో మాట్లాడి తిరిగి అత్తారింటికి పంపినట్లు తెలిపారు. ఈ నెల 11న తెలిసిన వారు తమకు ఫోన్ చేసి మీ కుమార్తె చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని సమాచారం అందించారన్నారు. తాము అక్కడికి వెళ్లి చూడగా ఆర్తీ ముఖంపై గాయాలు ఉన్నాయని, మూడు నెలల గర్భవతిగా ఉన్న తమ కుమార్తెను భర్త, అత్త, మామ, ఆడపడుచు, ఆమె భర్త కలిసి హత్య చేశారని ఆరోపించారు. తాము పోలీసులను ఆశ్రయించగా కేవలం 304 బి సెక్షన్ కింద కేసు నమోదు చేశారని, నిందితులపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్.మంజుల, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాల్లో మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని దుర్గామాత, శారదాదేవి, లక్ష్మీదేవి, పార్వతీమాతలకు అర్చనలు, అభిషేకాలు చేశారు. మణికొండ భాగ్యలక్ష్మికాలనీలోని దుర్గామాత దేవాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. –మణికొండ

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం యాంటీ ర్యాగింగ్ వీక్‌లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ నరేంద్రరెడ్డి విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే పరిణామాలపై వివరించారు. కళాశాలలో స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేయడమే కాకుండా కళాశాలల నుంచి డిబార్ చేయడం జరుగుతుందన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రహునాథ్ మృతదేహం

అత్తాపూర్: ఉపాధి కోసం వలస వచ్చిన ఓ కూలీ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఏఎస్‌ఐ మహ్మద్ అర్షద్‌అలీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన రాహునాథ్(45) భార్య ఊర్మిలా బాయి , కుమారుడు బబ్లుతో కలిసి ఆరు నెలల క్రితం అత్తాపూర్ తేజస్విని నగర్‌కు వలస వచ్చాడు. స్థానికంగా ఓ బిల్డర్ వద్ద భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. తరచూ అతను తప్ప తాగివచ్చి భార్య పిల్లతో గొడవ పడేవాడు. శుక్రవారం ఉదయం భార్యతో గొడవపడిన రాహునాథ్ నిర్మాణ ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేస్త్రీ గోవర్ధన్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చరీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సులువైన మార్గంలో విద్యాబోధన



డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న మంచులక్ష్మి

మణికొండ: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన ఉంటే వారు మరింత రాణించే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో 'టీచ్ ఫర్ చేంజ్', వేణిరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో 25 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు సినీనటి టీచ్‌ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు మంచు లక్ష్మి అన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమె మొదటి డిజిటల్ తరగతి గదిని వేణిరావు ఫౌండేషన్ వ్యవస్థాపక ట్రస్టీ, చిరక్ స్కూల్ వ్యవస్థాపకురాలు రత్నారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో 2014నుంచి పనిచేస్తుందన్నారు. తమ సంస్థ చేపడుతున్న అనేక కార్యక్రమాలతో 67,336 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జాతీయ విద్యావిదానానికి అనుగుణంగా టీచ్ ఫర్ చేంజ్ ద్వారా ప్రాథమిక భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉల్లాసం కలిగించే పెయింటింగ్‌లు, డిజిటల్ క్లాస్ రూంలు, లైయింగ్ టేబుల్‌లు, కార్పెట్‌లను ఏర్పాటు చేసి ఆడియో, విజువల్ కరిక్యులం ద్వారా సులువైన రీతిలో ఆసక్తికరంగా పాఠాలు బోధిస్తామన్నారు. రత్నారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు తమ సంస్థ ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులతో వచ్చిన ఫలితాలను తిరిగి వారికి అర్థం అయ్యేలా వివరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంగ్యా నాయక్, నిరంజన్, బీఆర్‌ఎస్ నాయకుడు కె.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



జలమండలి ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రణాళికాబద్ధంగా వాటిని పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని జలమండలి ఎండి దాన కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల డ్రైనేజీ పనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి జలమండలి ఎండి దాన కిషోర్ సానుకూలంగా స్పందించారని నిధుల మంజూరుకు హామీ ఇచికచనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతించండి



దేవాదాయ శాఖ కమిషనర్‌తో నార్సింగి చైర్‌పర్సన్, అధికారులు, కౌన్సిలర్లు

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి శ్రీ మచిలేశ్వరస్వామి దేవాలయం వరకు రోడ్డు వేసేందుకు అనుమతించాలని నార్సింగి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు దేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి, కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం చుట్టూ ఇప్పటికే మున్సిపల్ నిధులతో రోడ్లు, డ్రైనేజీ తదితర సౌకర్యాలను కల్పించామన్నారు. ఇందులో భాగంగా హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగుల రోడ్డుగా చూపుతున్న దానిని అభివృద్ధి చేస్తుండగా దేవాదాయ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే దేవాలయానికి వచ్చి స్వయంగా పరిశీలించి సానుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ నరసింహారాజు, టీపీఎస్ పావని, కౌన్సిలర్ జి.శివారెడ్డి, నాయకులు శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ,ఎస్టీ టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్ జయరాం, ఉపాధ్యక్షుడిగా జీ పరమేశం, కార్యదర్శులుగా కేబీ ఈశ్వర్, కే బాల నర్సింహ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సీ అరుణ్‌కుమార్, శ్రీనివాస్ ,ట్రెజరర్‌గా ఎస్ నర్సింగ్‌రావును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతు ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



నూతన కార్యవర్గ సభ్యులు

మనూలో 'మౌలానా ఆజాద్ ఏ లైఫ్' పుస్తకావిష్కరణ

రాయదుర్గం: భారతదేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ ఎంతో కృషి చేశారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానాఅబుల్ కలామ్ ఆజాద్‌పై రెండవ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని ఎన్‌యూఈపీఏ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ రచించిన 'మౌలానా ఆజాద్ ఏ లైఫ్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అమీర్‌అలీ మాట్లాడుతూ భారతదేశంలోనే మౌలానా ఆజాద్ గొప్ప రాజనీతిజ్ఞుడుగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. మనం అధికారం గురించి ఎలా ఆలోచించాలో అందరికీ దిశానిర్దేశం చేశారన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ షొన్నారో డ్రిగ్స్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్, ప్రొఫెసర్ మహ్మద్ సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: మహిళల దృష్టి మరల్చి బంగారు గొలుసుల చోరీలకు పాల్పడుతున్న యువకుడిని శంషాబాద్ సీసీఎస్, కేశంపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు.. కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్వాల్ గ్రామంలో ఈ నెల 7న సాయంత్రం జె. శ్రీలత అనే మహిళ తమ పొలంలో ఆవులు మేపుతుండగా బైక్‌పై అక్కడికి వచ్చిన ఓ యువకుడు ఆమె వద్దకు వెళ్లి ఫోన్‌లో ఓ ఫోటోను చూపించి గుర్తుపడతావా అని అడిగాడు.. ఆమె ఫొటో చూస్తుండగానే ఆమె కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న 4.5 తులాల పుస్తెల తాడును లాక్కుని నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేశంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన నడిమిగంటి శ్రీకాంత్‌గా గుర్తించారు. ఓ కంపెనీలో హౌస్ కీపింగ్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ సులభంగా డబ్బులు సంపాదించేందుకు పొలాల్లో ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం అతడిని ఎక్లాస్‌ఖాన్ పేట వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి బైక్‌తో పాటు చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన పోలీసులను ఈ సందర్భంగా డీసీపీ అభినందించారు.